క్లుప్తంగా

నేడు సీక్యాంపు రైతు బజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు రైతు బజారును ఈ నెల 27న బంద్ చేస్తున్నట్లు ఎస్టేట్ అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రైతు బజారులో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా బుధవారం సెలవు ప్రకటించినట్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు, రైతుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రైతుబజారును శానిటైజ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు. గురువారం నుంచి యథావిధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల భిక్షాటన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమ్మెలోకి వెళ్లిన ఉద్యోగులను చర్చలకు పిలవాలన్నారు. సమ్మెలో భాగంగా ఏడో రోజు మంగళవారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భిక్షాటన చేస్తూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. వీరికి యూటీఎఫ్ నాయకులు రవికుమార్, నవీన్‌పట్నాయక్, హేమంత్ తదితరులు మద్దతు ప్రకటించారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

కర్నూలు(సెంట్రల్): సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని సీఆర్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేస్తూ పేదల పక్షాన నిలబడుతున్న పార్టీ సీపీఐ అన్నారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.రామకృష్ణారెడ్డి, డి.శ్రీనివాసరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన



పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కర్నూలు(సెంట్రల్): సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె మంగళవారం 15వ రోజుకు చేరింది. శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో పొర్లుదండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. వీరికి పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ

కర్నూలు సిటీ: ఏపీటీఎఫ్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని మంగళవారం డీఈఓ రంగారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. డైరీలో ఉద్యోగులకు కావాల్సిన సమాచారం అందుబాటులో ఉంచారన్నారు. వచ్చే ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మారియానందం, జిల్లా గౌరవ అధ్యక్షుడు కమలాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యవర్గం



చంద్రమౌళి

కర్నూలు (టౌన్): జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా చంద్రమౌళి ఎన్నికయ్యారు. మంగళవారం విశాఖపట్నంలోని పాత గాజువాక సంఘం కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 2023–2027 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శితో పాటు జిల్లా సంయుక్త కార్యదర్శిగా టి.వెంకటేశ్వర్లును ఎన్నుకున్నట్లు ఆ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

క్రీడాకారులకు వరం ఆడుదాం.. ఆంధ్రా

- ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్
- అట్టహాసంగా ప్రారంభమైన క్రీడా పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న యువతీయువకులు



కోడుమూరులో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు గ్రామీణ క్రీడాకారులకు వరంలాంటిదని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్యాలకుర్తి, పులకుర్తి, కోడుమూరులోని బాలుర హైస్కూల్లో పోటీలకు ఆయన ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఉండే క్రీడాకారులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. క్రీడలతో చక్కటి ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరిప్రసాద్, మండల స్పెషలాఫీసర్ రంగా లక్ష్మీదేవి, తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, హెచ్ఓ మదన్‌మోహన్, ఈఓ అజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. లద్దగిరి గ్రామంలో ఎంపీపీ రూతమ్మ పోటీలను ప్రారంభించారు.

పాణ్యం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను ఎంపీపీ ఉసేన్‌బీ ప్రారంభించారు. మండలంలో మొత్తం 4268 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు.

కర్నూలు (న్యూటౌన్): ఆడుదాం ఆంధ్రా పోటీలను గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోయ శారద అన్నారు. కల్లూరు మండలం సల్కాపురంలో పోటీలను ప్రారంభించారు.

కర్నూలు సిటీ: దేశంలోనే అతి పెద్ద టోర్నీగా ఆడుదాం ఆంధ్రా అవుతుందని ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహిమియాలు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని కాల్వ, హుసేనాపురం గ్రామాలలో నిర్వహించిన షెటిల్, క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువతను క్రీడల్లో ప్రోత్సహించే దిశగా ఆడుదాం..ఆంధ్ర పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు బహుమతులు అందజేస్తున్నామన్నారు. అనంతరం హుసేనాపురం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే తిలకించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సర్పంచ్ పెద్ద వెంకటేశ్వర్లు, చంద్ర గోవర్ధనమ్మ, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, చంద్రపెద్దస్వామి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, కాల్వబుగ్గ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, మాజీ చైర్మన్ గోపా రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో దళారుల కట్టడికి చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మార్కెట్ యార్డులో దళారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మార్కెట్ యార్డు సమావేశం మందిరంలో పాలకవర్గం సమావేశమైంది. రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం జూలై 2023 నుంచి నవంబర్ 2023 వరకు వచ్చిన ఆదాయం, వ్యయాలను పరిశీలించి ఆమోదించారు. కాగా మంగళవారం కాటసాని జన్మదినం కావడంతో పాలక మండలి సభ్యులు ఆయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు



ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు

కర్నూలు సిటీ: పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే కృషి, పట్టుదల అవసరమని ఎస్వీఆర్ కోచింగ్ సెంటర్ గౌరవ సలహాదారుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుని సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు సాధించిన వారికి మంగళవారం అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఆత్మస్థైర్యం చాలా ముఖ్యమని, క్రమ శిక్షణతో పాటు, రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయాలన్నారు. తమ కోచింగ్ సెంటర్‌లో 14 మందికి ఎస్ఐ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్రణాళిక, సాధనతోనే విజయం సాధించామని ఎస్ఐ విజేతలు చిన్నరాయుడు, రాజశేఖర్, మున్నా నాయక్, గోరంట్ల, చంద్రశేఖర్, కళ్యాణ్, సుబ్బరాయుడు, ప్రతాప్, కవిత, జయశ్రీ చెప్పారు.

థెరిస్సమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సతీష్, కుటుంబ సభ్యులు

కర్నూలు సిటీ: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తల్లి, జార్జ్ విద్యాసంస్థల మాజీ చైర్మన్ ఆదిమూలపు థెరిస్సమ్మ మొదటి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఏ క్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మైపర్ విద్యా సంస్థల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్, అకడమిక్ డైరెక్టర్ స్టెల్లా సతీష్ జార్జ్, థెరిస్సమ్మ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్రిస్మస్ క్రీడా పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కర్నూలు (టౌన్): స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం క్రిస్మస్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కోల్స్ చర్చి సంఘం అధ్యక్షుడు అబ్రహాం లింకన్ ప్రారంభించారు. ఏటా పర్వదినాల్లో ఆధ్యాత్మిక, సాంఘీక కార్యక్రమాలతో పాటు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, క్యారెమ్స్, క్రికెట్, ఫుట్‌బాల్ పోటీలు ఉంటాయన్నారు. చర్చి పాస్టర్లు రెవరెండ్ అనిల్‌కుమార్ సామ్యేల్, రెవరెండ్ జీవన్‌రావు పాల్గొన్నారు.

అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటాం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏసీ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలు.. అలాగే ఫారం 6, 7, 8 లలో ఇబ్బందులు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పారదర్శక ఓటరు జాబితా రూపొందించేందుకు అందరి సహకారం అవసరమన్నారు. డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, అర్బన్ తాలుకా తహసీల్దార్ విజయశ్రీ, ఎన్నికల డీటీ ధనుంజయ్ పాల్గొన్నారు.


తుంగభద్ర నదిలోకి చేప పిల్లలు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల వద్ద తుంగభద్ర నదిలో కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ మంగళవారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మత్స్యకారులు నదిలో చేపలు పెంచుకునేందుకు అనువుగా ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన సుమారు రూ.18 లక్షల విలువైన చేప పిల్లలను నదిలో వదిలామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయని విధంగా మత్స్యకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహిమియా తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలభ్రామరికి లక్ష కుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి మార్గశిరశుద్ధ పౌర్ణమి సందర్భంగా మంగళవారం లక్షకుంకుమార్చన పూజలను నిర్వహించారు. లక్షకుంకుమార్చన పూజలో భక్తుల పరోక్ష సేవగా పాల్గొనేందుకు దేవస్థానం అవకాశం కల్పించింది. లక్ష కుంకుమార్చన పూజలో భాగంగా అర్చకులు, వేదపండితులు ముందుగా పూజా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను నిర్వహించారు. అనంతరం లక్షకుంకుమార్చనను జరిపించారు.

డీఈఓపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు



డీఈఓ రంగారెడ్డి

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు డీఈఓ వి.రంగారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఏ.రామకృష్ణ తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీ కలెక్టరేట్‌లో జరిగిన ఉద్యోగుల స్పందనలో డీఈఓ తనను అధికారుల ఎదుట తిట్టి అవమానించారని నంద్యాల పట్టణానికి చెందిన కె.సతీష్‌కుమార్ అనే ఉపాధ్యాయుడు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి మంగళవారం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..బనగానిపల్లె మండలం రేవనూరు జెడ్పీ పాఠశాలలో కె.సతీష్‌కుమార్ హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అతను సమాచారం హక్కు చట్టం ద్వారా ఉన్నతాధికారులను పదే పదే ప్రశ్నలు అడిగేవారు. దీంతో డీఈఓ రంగారెడ్డి అతన్ని సస్పెండ్ చేయడం, బదిలీ చేసి వేతనాలు రాకుండా అడ్డుకోవడం, వేధింపులకు గురిచేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): గార్గేయపురంలోని శ్రీచెన్నకేశవ ఆంజనేయస్వామి ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దేవదాయ అధికారి రామాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మద్దూరునగర్‌లోని సహాయ కమిషనర్, జిల్లా దేవదాయశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులను పొందవచ్చని పేర్కొన్నారు. జనవరి 15వ తేదీలోపు రిజిస్టర్ పోస్టు లేదా నేరుగా తెచ్చి ఇవ్వొచ్చన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు కుల ధ్రువీకరణ, ఆధార్, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలను ఇవ్వాలని తెలిపారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత కోచింగ్

కర్నూలు(అర్బన్): నగరంలోని బిర్లా కాంపౌండ్ వద్దనున్న శ్రీధర్స్ బ్యాంక్ కోచింగ్ సెంటర్‌లో మైనారిటీ విద్యార్థులకు గ్రూప్–2లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏపీ మైనారిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ కోచింగ్ సెంటర్ ప్రారంభం కానుందన్నారు. శిక్షణకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన ముస్లిం, క్రిస్టియన్ బిసీసీ, బుద్దిస్ట్, జైన్స్, సిక్కు, పార్సీస్ వర్గాలకు చెందిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా తమ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9577484848 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వేడుకగా దత్తజయంతి





ప్రత్యేక అలంకరణలో స్వామివారు, భక్తులకు ప్రసాదాల పంపిణీ

కర్నూలు(సెంట్రల్): దత్త జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కర్నూలు నగరంలోని పలు దేవాలయాల్లో దత్తాత్రేయస్వామికి తైలాభిషేకాలు, దత్త హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామి కృపకు పాత్రులయ్యారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకుని మంగళవారం సదానంద వన్‌నెస్ సర్వీస్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని రైల్వేస్టేషన్, హాస్పిటల్, రోడ్డుపక్కన నివసిస్తున్న వారికి అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు బైజుబాబు, వినయ్, ముస్తాక్, దాదాపీరా, బాషా పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఉద్యోగుల వాహనాలకు స్టిక్కర్లు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగుల వాహనాలకు ప్రత్యేక స్టిక్కర్లను అందుబాటులోకి తెచ్చినట్లు డీఆర్వో కె.మధుసూదన్‌రావు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో స్వచ్ఛ కలెక్టరేట్‌పై సమీక్షించారు. కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో పనిచేసే 670 మంది వాహనాలకు స్టిక్కర్లను పంపిణీ చేస్తామని, ఆయా శాఖల అధికారులు తీసుకెళ్లాలన్నారు. ఇందులో ఫోర్ వీలర్‌కు సంబంధించి 88, టూ వీలర్‌కు సంబంధించి 552 వాహనాలు ఉన్నట్లు తెలిపారు. వీరంతా కేటాయించిన స్థానాల్లో వాహనాలను పార్కింగ్ చేయాల్సి ఉంటుందన్నారు.

వేతనాలు చెల్లించాలని క్లాప్ డ్రైవర్ల ధర్నా

కర్నూలు (టౌన్): క్లాప్ డ్రైవర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు కోరారు. మంగళవారం నగరపాలక కార్యాలయం ఎదుట క్లాప్ డ్రైవర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ క్లాప్ డ్రైవర్లకు రూ.18 వేల వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. సంఘం నాయకులు విజయ్‌రామాంజనేయులు, సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ

కర్నూలు (టౌన్): శ్రీకాకుళం జిల్లా పాతపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే 41వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ చాటాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పోటీలను సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు.